నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 24 జూలై 2024 | VIKARABAD



# డ్రగ్స్ వాడితే ఇంటికే..

**మాదక ద్రవ్యాల కట్టడికి పోలీస్ శాఖ సన్నద్ధం**

**డ్రగ్స్, గంజాయి వాడుతూ దొరికిన విద్యార్థులను ఇంటికి పంపించేలా**

**టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు నార్కోటిక్ అధికారుల ఫిర్యాదు**

**డ్రగ్స్‌కు అడ్డాగా ఇంజినీరింగ్ కళాశాలలు, వసతిగృహాలు**

**నగర శివారులో విస్తరిస్తున్న డ్రగ్స్, గంజాయి కల్చర్**



ఇబ్రహీంపట్నం, జూలై 23 : నగర శివారులోని పలు ఇంజినీరింగ్ కళాశాలలు, హాస్టళ్లు డ్రగ్స్‌కు అడ్డాగా మారుతున్నాయి. ఓ వైపు ఎస్‌వోటీ పోలీసులు మాదక ద్రవ్యాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నా ఫలితం లేకపోవడంతో నార్కోటిక్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లోని ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రైవేట్ హాస్టళ్లలో ప్రత్యేక బృందాలతో దాడులను ముమ్మరం చేశారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం సెగ్మెంట్లలో కలిపి 30 వరకు ఇంజినీరింగ్ కాలేజీలు, వంద వరకు ప్రైవేట్ హాస్టళ్లున్నాయి. ఈ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్, గంజాయి విక్రయదారులు రెచ్చిపోతున్నారు. మత్తు పదార్థాలను వివిధ రూపాల్లో వారికి చేరవేస్తున్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ కళాశాలల పరిసరాల్లో ఉన్న హోటళ్లు, పాన్‌షాపులు డ్రగ్స్ విక్రయానికి కేంద్రంగా మారాయి. ఇటీవల ఓ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పదిహేను మంది విద్యార్థులు డ్రగ్స్ వాడుతూ నార్కోటిక్ పోలీసులకు చిక్కారు. అలాగే, మంగల్‌పల్లి సమీపంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడ్డారు. దీంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం డ్రగ్స్‌కు కేంద్ర బిందువుగా మారిపోతున్నది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడిన వ్యాపారులకు ఇబ్రహీంపట్నంతో సంబంధమున్నట్లు తెలుస్తున్నది. ఇక్కడి కళాశాలల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు చదువుతుండడంతో వారికి అన్ని దేశాల వారితో సంబంధాలుంటున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు తరలించి అక్కడి నుంచి ఇబ్రహీంపట్నంలోని ఆయా కళాశాలల విద్యార్థులకు చేరవేస్తున్నారు. ఇటీవల మంగల్‌పల్లి, బొంగుళూరు, ఇబ్రహీంపట్నం, బీఎన్‌రెడ్డినగర్ వంటి ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయిస్తూ వ్యాపారులు, కొంటూ విద్యార్థులు పట్టుబడ్డారు.

### పట్టుబడిన విద్యార్థులపై కఠిన చర్యలకు పోలీసులు సన్నద్ధం..

డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు వాడుతూ పట్టుబడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసుశాఖ సిద్ధమైంది. డ్రగ్స్ వాడుతూ దొరికిన విద్యార్థులను కళాశాలల నుంచి ఇంటికి పంపేలా టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారులకు సిఫార్సు చేస్తున్నారు. ఇప్పటికే ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పట్టుబడిన విద్యార్థులపై నార్కోటిక్ అధికారులు చర్యల నిమిత్తం టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారులను కోరినట్లు సమాచారం. డ్రగ్స్ మహమ్మారిని త్వరగా కట్టడి చేయాలని.. పట్టుబడిన విద్యార్థులను ఉపేక్షిస్తే ఈ సంస్కృతి మరింత పెరిగే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు.

### పుట్టిన రోజు వేడుకల్లోనూ..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రిసార్ట్స్ కల్చర్ రోజురోజుకూ పెరిగిపోతున్నది. ఇంజినీరింగ్ విద్యార్థులు రిసార్ట్స్‌లను అద్దెకు తీసుకుని సహచర విద్యార్థులతోపాటు ఇతర విద్యార్థుల పుట్టిన రోజు వేడుకలు జరుపుతున్నారు.

ఈ వేడుకల్లో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలను వాడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో సుమారు వంద వరకు రిసార్ట్స్ ఉండగా...ఈ రిసార్టుల్లో ప్రతిరోజూ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులే ఎక్కువగా వేడుకలు చేసుకుంటున్నారని సమాచారం.



### ప్రత్యేక బృందాలతో నిరంతర నిఘా..

ఇక నుంచి ఇంజినీరింగ్ కళాశాలల్లోని విద్యార్థులు డ్రగ్స్ వాడుతూ..పట్టుబడితే ఇంటికే పంపిస్తాం. ఈ మేరకు ఎస్‌వోటీ, నార్కోటిక్, సివిల్, డ్రగ్స్ పోలీసులతో కలిసి ఏర్పాటైన ప్రత్యేక బృందాలు కళాశాలల విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారిస్తాయి. ఇప్పటికే డ్రగ్స్ వాడుతూ..పట్టుబడిన పలువురు విద్యార్థులపై నార్కోటిక్ పోలీసులు ఉన్నత విద్యామండలికి లేఖలు రాశారు. మత్తు పదార్థాల సమూల నిర్మూలనకు నిరంతర నిఘా పెడుతాం.

**-కేవీపీ రాజు, ఏసీపీ ఇబ్రహీంపట్నం**

# పెండింగ్ ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



↑ మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, జూలై 23 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా సమీకృత సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై కలెక్టర్ శశాంక ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లకు సూచించారు. రోజు వారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆగస్టు 15వ తేదీ లోపు పూర్తిస్థాయిలో పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. యాచారం, కందుకూరు, చేవెళ్ల, మొయినాబాద్, మంచాల, మహేశ్వరం మండలాల్లో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా త్వరలో పరిష్కరించాలని సంబంధిత మండలాల అధికారులను ప్రత్యేకంగా ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భూపాల్ రెడ్డి, మహేశ్వరం ఆర్డీవో సూరజ్ కుమార్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి, చేవెళ్ల ఆర్డీవో సాయిరామ్, రాజేంద్ర నగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, జిల్లాలోని అన్ని మండలా తహసీల్దార్లు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మిగిలిన డబ్బులు చెల్లిస్తేనే.. మాఫీ

**రూ.2 లక్షలపై ఉన్న రుణాలను చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందంటూ కొత్త కొర్రీ**

**ఆగస్టు 15 లోపే చెల్లించాలి.. లేకుంటే మాఫీ కావు**

**అన్నదాతలకు వ్యవసాయాధికారుల సూచన**

**కొత్త చిక్కులు రావడంతో ఆందోళనలో రైతులు**

**మళ్లీ వడ్డీ వ్యాపారుల ఆశ్రయం**

**రూ. లక్ష లోపు రుణమాఫీ కాలేదంటూ వేల సంఖ్యలో వినతుల వెల్లువ**

వికారాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): అర్హులందరికీ రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామంటూ గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతను అడుగడుగునా ఇబ్బందులకు గురి చేస్తున్నది. గత బీఆర్‌ఎస్ ప్రభు త్వం ఎలాంటి షరతుల్లేకుండా రుణ మాఫీ ప్రక్రియను పూర్తి చేస్తే.. ప్రస్తుత రేవంత్ సర్కార్ ప్రకటించిన రూ. లక్ష లోపు రుణమాఫీపై కొర్రీలతోపాటు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మాఫీకి అర్హత ఉండి జాబితాలో పేరు రాని వారు కొంద రైతే.. రుణమాఫీ జాబితాలో పేర్లుండి కూడా.. మాఫీ సొమ్ము ఖాతాల్లో పడని వారు వేల సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వం పెడుతున్న కొర్రీలతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టాదారు పాసుపుస్తకం ప్రామాణికమంటూ రేషన్‌కార్డు ఆధారంగా ప్రక్రియను కొనసాగిస్తూ అర్హులకు అన్యాయం చేస్తుండడంతో సర్కారుపై రుసరుస లాడుతున్నారు. తాజాగా క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు రైతులకు కొత్త కష్టాలను తీసుకొచ్చారు. రూ.2 లక్షలపైన ఉన్న రుణాలను ఆగస్టు 15 లోపు చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని.. లేకపోతే వర్తించదని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఎలాంటి షరతుల్లేకుండా రూ.2 లక్షల్లోపు రుణాలను మాఫీ చేస్తామని హామీఇచ్చి.. ఇప్పుడు మెలిక పెట్టడంపై జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. రేషన్ కార్డు ఆధారంగా ఓ కుటుంబంలో ఐదుగురి పేరి ట రుణాలుండి వడ్డీతో కలిపి రూ.2 లక్షల పైన ఉన్నట్లైతే తప్పనిసరిగా పైచిలుకు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలు ఆగస్టు మొదటి వారంలో విడుదల కానున్నట్లు సమాచారం.

### కొత్త మెలికపై రైతుల ఆగ్రహం..

ఏక కాలంలో రూ.2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం హామీనిచ్చి ప్రస్తుతం రూ.లక్ష లోపు రుణాల మాఫీ ప్రక్రియను చేపట్టింది. అయితే పట్టాదారు పాసుపుస్తకం కాకుండా రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో వేలాది మంది అర్హులైన రైతులు నష్టపోతున్నారు. అదేవిధంగా రూ.2 లక్షలపైన ఉన్న రుణాలను ఆగస్టు 15లోపు చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయాధికారులు చెప్తుండడంపై జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఒక వైపు రుణాలను మాఫీ చేస్తున్నామంటూనే తిరిగి రైతుల నుంచి ముక్కు పిండి వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికి ఇప్పుడు తమను నట్టేట ముంచుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రుణాలు రూ.2లక్షల పైచిలుకు ఉన్న రైతులు మిగతా రుణాలను చెల్లించేందుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే పంట పెట్టుబడికి అప్పులు చేసిన రైతులు, ఇప్పుడు రుణమాఫీ వర్తించేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి షరతుల్లేకుండా పట్టాదారు పాసుపుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకొని రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేసిన విషయాన్ని రైతులు ఊరూరా గుర్తు చేసుకుంటున్నారు.

### వేల సంఖ్యలో 'రుణమాఫీ' వినతులు..

జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం మొదలుకొని క్షేత్రస్థాయిలో ఏఈవోల వరకు రైతులు వేలాదిగా తరలివచ్చి రుణమాఫీ కాలేదంటూ ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు పెట్టి కేవలం కొంతమందికే రుణమాఫీ చేయడంతో మా పంట రుణాలు ఎందుకు మాఫీ కాలేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. రుణమాఫీ కాని రైతుల సంఖ్య అధికంగా ఉండడంతో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూంను ఏర్పాటు చేయడంతోపాటు ఏడీవోలోని టెక్నికల్ సెక్షన్‌లో, మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో, క్షేత్రస్థాయిలో క్లస్టర్ల వారీగా ఏఈవోలు రుణమాఫీ కాని రైతుల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా సుమారు 2వేల మంది రైతులు తమకు రూ.లక్ష లోపు రుణాలున్నా రుణమాఫీ కాలేదని విన్నవించారు. వీరందరికీ రేషన్ కార్డు లేకపోవడంతోనే రుణమాఫీ వర్తించలేదని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.



### అన్ని రుణాలను ఒకేసారి మాఫీ చేయాలి..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఒకేసారి రూ. రెండు లక్షల రుణాలను మాఫీ చేస్తామని చెప్పి.. ఇప్పుడు విడతల వారీగా చేయడం సరైంది కాదు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి రూ.2 లక్షల రుణాలను మాఫీ చేయాలి. నా అప్పు రూ.2,50,000 వరకు ఉన్నది. రూ.రెండు లక్షల పైన ఉన్న డబ్బును వచ్చే నెల 15 లోపు చెల్లిస్తేనే రుణ మాఫీ వర్తిస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అలా కట్టించుకోవడం సమంజసం కాదు.

**– ముడావత్ లక్ష్మణ్, రైతు, ఎర్రగడ్డతండా, పెద్దేముల్**



### పై మొత్తాన్ని చెల్లిస్తేనే మాఫీ అంటున్నారు..

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రుణమాఫీ చేస్తే నాతోపాటు ఎంతో మంది రైతుల రుణాలు మాఫీ అయ్యేవి. నా అప్పు రూ.2,72,000 వరకు ఉన్నది. ప్రస్తుతం రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేస్తుండడంతో నా అప్పు మాఫీ కాలేదు. కాగా వ్యవసాయ అధికారులు రుణమాఫీ వర్తించాలంటే ఆగస్టు 15 లోపు రూ. రెండు లక్షలపైన ఉన్న మొత్తాన్ని చెల్లిస్తేనే మాఫీ అవుతుందని..లేకుంటే మాఫీ వర్తించదని చెబుతున్నారు. ఇప్పటికే పంటల సాగుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల ఊబిలో కూరుకుపోయా. అన్నదాతల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం ఆ నిబంధనను తొలగించి అన్ని రుణాలను మాఫీ చేయాలి.

**– ముడావత్ రమేశ్, రైతు, నెల్లిగడ్డతండా, పెద్దేముల్**



# మెట్రో డీపీఆర్ జాప్యం

## రెండో దశకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపు శూన్యం

**డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించి ఉంటే బడ్జెట్‌లో నిధులు దక్కేవి**

**రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం.. మరో బడ్జెట్ దాకా ఆగాల్సిందేనా?**



సిటీబ్యూరో, జూలై 23(నమస్తే తెలంగాణ): కేంద్ర బడ్జెట్‌లో ప్రతిష్టాత్మక హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ఊసేలేదు. గత కేసీఆర్ ప్రభుత్వంతో పాటు తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రెండో దశ మెట్రోను వివిధ మార్గాల్లో నిర్మించాలని ప్రతిపాదించినా, కేంద్రం మాత్రం మొండి చేయి చూపింది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో ఒకటిగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో రైలు ఎంతో కీలకమైంది. అలాంటి ప్రాజెక్టును నగరం నలుమూలలా విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను కేంద్రం ముందు ఉంచినా ఫలితం లేకుండా పోయింది. కాగా, రెండో దశ మెట్రోకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించి సకాలంలో కేంద్రానికి సమర్పించకపోవడం వల్లే ఎలాంటి నిధులు కేటాయించలేకపోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డే మెట్రో ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తారని ఆశించామన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడిచినా కేంద్రం ముందు సమగ్ర ప్రాజెక్టు నివేదికను(డీపీఆర్) ఎందుకు ఉంచలేదని ఒకవైపు నగర వాసులు ప్రశ్నిస్తున్నారు.

### రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం..

నగరంలో మెట్రో విస్తరణ అత్యవసరమని గుర్తించిన గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు 200 కి.మీ దూరం నిర్మించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అందులో కొన్ని మార్గాలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రం ముందుంచింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను పూర్తిగా పక్కన పెట్టి కేవలం 70 కి.మీ మేర రెండో దశ మెట్రోను నిర్మించాలని కొత్త ప్రతిపాదనలు చేసింది. దానికైనా డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రం ముందు పెట్టకపోవడంతో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మెట్రో రెండో దశకు ప్రాధాన్యత ఇవ్వలేదు. మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహించిందని బడ్జెట్ నిపుణులు పేర్కొంటున్నారు. గతేడాది డిసెంబర్ – జనవరి నెలల్లోనే రెండోదశ మెట్రో డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని ప్రకటించి ఏడు నెలలు గడిచినా, డీపీఆర్ మాత్రం ఇప్పటికీ పూర్తి చేయించలేకపోయింది రాష్ట్ర ప్రభుత్వం. మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచి ఉంటే దానిని పరిశీలించి ఈ బడ్జెట్‌లో కొంతైనా కేటాయింపులు ఉండేవని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొదటి దశ మెట్రో పనులు 2021 నాటికే పూర్తయినా, అప్పటి నుంచి రెండో దశపై దృష్టి సారించినా డీపీఆర్‌ను రూపొందించడంలో మాత్రం హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ విఫలమైందని నిపుణులు పేర్కొంటున్నారు. మెట్రో రైలు అవసరమైన మార్గాలన్నీ తెలిసినా మెట్రో అధికారులు డీపీఆర్‌ను రూపొందించడంలో తీవ్ర జాప్యం చేయడం వల్లే కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగలేదనే అభిప్రాయాన్ని బీజేపీకి చెందిన ప్రజా ప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు. మెట్రోకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు దక్కాలంటే వచ్చే ఏడాదిలో ప్రవేశ పెట్టే బడ్జెట్ దాకా వేచిచూడాల్సిందేనా అంటూ నగర వాసులు పెదవి విరుస్తున్నారు.

# మత్తును చిత్తు చేద్దాం

**వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి**

వికారాబాద్, జూలై 23 : మత్తును చిత్తు చేసేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. జిల్లాలో 31 గంజాయి కేసుల్లో 104 కేజీల 530 గ్రాములు గంజాయిని పట్టుకొని సీజ్ చేసిన తర్వాత వికారాబాద్ కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ గ్రామంలోని మెడికర్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో కాల్చి వేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎవ్వరూ గంజాయి, ఇతర మత్తుకు అలవాటు పడవద్దన్నారు. ముఖ్యంగా యువకులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా మంచి మార్గంలో నడువాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, గంజాయి వంటి మత్తు పదార్థాలు ముందుగా ఆనందాన్ని కలిగించినా.. చివరకు జీవితంలో విషాదాన్ని మిగిలిస్తాయన్నారు. జిల్లావాసులు గంజాయిపై ఉక్కు పాదం మోపాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లపై దృష్టి సారించి మత్తు పదార్థాలు ఇతర చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ తరపున గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, వ్యాపారం, సేవించే వారిపై దృష్టి పెట్టామని వివరించారు. ఎవరైనా మత్తు పదార్థాలను ప్రోత్సహించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎవరికైనా మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీస్ అధికారులకు అందించాలని, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, వికారాబాద్, పరిగి, తాండూరు డీఎస్పీలు అధికారులు, సీఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పట్టుబడిన మత్తు పదార్థాలను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి